
సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



ఆస్వాదిద్దాం రండి...
విద్యార్థులకు సెలవుల కాలం.. పరీక్షలన్నీ పూర్త య్యాయి. విహారయాత్రలకు వెళ్లలేని వారికి నిర్మల్ సమీపంలోనే ఆహ్లాదం పొందేందుకు, వీక్షించేందుకు ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి.

6లో ▸



1008 కలశములతో పూజలు
మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం 1008 కలశములతో అభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆలయ ఈవో ముక్తారవి పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
33.0 /24.0

వాతావరణం
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. తూర్పు దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

గుడిపేటలోనే మెడికల్ కళాశాల
- స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



సంబురాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోనే మెడికల్ కళాశాల భవన నిర్మాణం జరగనుంది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గుడిపేట శివారులోని 294, 300 సర్వేనంబర్లలో సుమారు 32 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు పేర్కొంది. భవనానికి స్థలం కేటాయిన్నట్లు అధికారికంగా ప్రకటించడంతో గుడిపేటలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. జాతీయ రహదారిపై పెద్దయెత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ నాయకులు మాట్లాడుతూ గుడిపేటలోనే అన్ని విధాలుగా మెడికల్ కళాశాల అనువుగా ఉంటుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూలంగా స్పందించి మంజూరు చేసినట్లు తెలిపారు. తహశీల్దార్ రాజలింగు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ మధూకర్, గిర్దావర్ లావణ్య స్థలం అప్పగింతపై తయారు చేసిన జిమ్మా పత్రికను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారని పేర్కొన్నారు. అనంతరం మండలవాసులు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. సంబరాల్లో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, నాయకులు మందపల్లి శ్రీనివాస్, లగిశెట్టి రాజన్న, దొమ్మటి లచ్చన్న, కారుకూరి చంద్రమౌళి, జీవన్‌రావు, దొమ్మటి బాపు, బేర పోశం, మట్టపల్లి సత్యనారాయణ, కొట్టె మహేందర్, గోళ్ల శ్రీనివాస్, ఆనె మల్లేశ్ పాల్గొన్నారు. జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, నాయకులు దొమ్మటి సత్తయ్య, ధర్ని శంకర్ పాల్గొన్నారు.

'పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

పాతమంచిర్యాల: బీజేపీ కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల హామీలను నెరవేర్చాలని మందమర్రిలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ప్రశ్నించడానికి వెళ్లిన బీజేపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అసభ్యకర పదజాలంతో దూషించడాన్ని ఖండించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై ఎమ్మెల్యే బాల్క సుమన్ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. భీమారం మండలంలోని జోడువాగుల వంతెన నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటోందని బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలిపారు. రాష్ట్రం కేంద్రానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకుండా జాప్యం చేయడంతోనే అనుమతులు రావడం లేదన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్, నాయకులు అక్కల రమేష్, గద్దం శ్రీనివాస్, ఓరుగంటి సురేందర్, మహేష్, ఓదేలు, రాజమల్లు పాల్గొన్నారు.

పేరుకో చరిత్ర



బెల్లంపల్లి రైల్వేస్టేషన్



బెల్లంపల్లి: సృష్టిలో ప్రతీదానికి ఓ పేరుంటుంది. ఆ పేరు వెనుక నేపథ్యమూ ఉంటుంది. మనుషులు.. ఊర్లు.. బస్తీలు.. ప్రదేశాలు.. ప్రాంతాలు.. వస్తువులు ఏవైనా సరే పేరుతోనే గుర్తింపు లభిస్తుంది. నల్లబంగారం నేల బెల్లంపల్లికి, ఇక్కడ ఏర్పడిన బస్తీల పేర్ల వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. పరిసరాల స్థితిగతులు, కాలమాన పరిస్థితుల ప్రభావం కూడా పేరుకు కారణం కావొచ్చు. తీరైన పేర్లు, నామకరణంలో ఎన్నో వింతలు, విశేషాలు, గూడార్థాలు, మరెన్నో ఆసక్తికరమైన అంశాలు తెలుసుకుందాం.

సండే స్పెషల్

బెల్లం.. పల్లె
బొగ్గుగనుల ఆవిర్భావంతో 1928 ప్రాంతంలో బెల్లంపల్లి పురుడుబోసుకుంది. అంతకుముందు ఈ ప్రాంతం వాగులు, వంకలు కలిగి దట్టమైన అటవీ సంపదతో కీకారణ్యంగా ఉండేది. నిజాం ప్రభువు ఏలుబడిలో బ్రిటీష్ భూగర్భ భౌగోళిక శాస్త్రవేత్తలు సర్వే చేసి అపారమైన బొగ్గు సంపద భూగర్భంలో నిక్షిప్తమై ఉన్నట్లు గుర్తించారు. బొగ్గు గనుల తవ్వకాలు చేపట్టే వరకూ ఈ ప్రాంతానికి చేరువలో ఓ పల్లె ఉండేది. ఆ పల్లెకు చెందిన గ్రామీణులు చెరుకు పండించి ఆ చెరుకుతో బెల్లం తయారు చేసి అమ్మకాలు సాగించేవారు. ఆ ప్రకారంగా 'బెల్లం' తయారు చేసిన పల్లెకు 'బెల్లంపల్లె' అనే పేరొచ్చింది. స్వాతంత్ర్యానికి పూర్వం 1934 ప్రాంతంలో బ్రిటీష్ పాలకులు హైదరాబాద్–ఢిల్లీ రైల్వేమార్గాన్ని ఏర్పాటు చేశారు. బొగ్గు గనులు ఏర్పడిన ఈ ప్రాంతంలో రైల్వేస్టేషన్ నిర్మించారు. ఆ స్టేషన్‌కు బెల్లంపల్లె అనే పేరు పెట్టగా.. కాలానుగుణంగా బెల్లంపల్లె కాస్త బెల్లంపల్లిగా వాడుకలోకి వచ్చి ఆ పేరు స్థిరపడిపోయింది. నాటి బెల్లం.. పల్లెనే నేటి బెల్లంపల్లి.

మహానుభావులు.. బస్తీలు
బెల్లంపల్లి మున్సిపాల్టీలో 34 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల పరిధిలోని బస్తీల పేర్లకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. స్వాతంత్ర్య సమరయోధులు, మహానుభావుల పేర్లతో బస్తీలు ఏర్పడ్డాయి. జాతిపిత మహాత్మాగాంధీ పేరుతో గాంధీనగర్, స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ పేరుతో సుభాష్‌నగర్, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరుతో అంబేద్కర్‌నగర్, అంబేద్కర్ రడగంబాల బస్తీ ఏర్పాటయ్యాయి.



బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం

బొగ్గు గనులు



బొగ్గు గనుల పేర్లతోనూ బస్తీలకు నామకరణం చేశారు. ప్రథమంగా మార్గన్స్ పిట్ గనిని ప్రారంభించగా ఆ గనికి అనుబంధంగా 24డీప్ ఏరియా గని ఏర్పాటు చేశారు. ఆ గని ప్రాంతంలో ఏర్పడిన బస్తీకి 24డీప్ ఏరియా బస్తీ అనే పేరు స్థిరపడింది. నంబరు–2 ఇంక్లైన్ గనిని విస్తరించారు. ఆ గని పక్కనే క్వార్టర్లను నిర్మించి కార్మికులకు కేటాయించిన ప్రాంతానికి నంబరు –2 ఇంక్లైన్ బస్తీ అనే పే రొచ్చింది. ఆ పక్కనే 65 డీప్ గని ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో ఏర్పడిన బస్తీకి 65డీప్ ఏరియా బస్తీ అనే పేరొచ్చింది. ఆ బస్తీకి కిలోమీటరు దూరంలో శాంతిఖని గని ప్రారంభించారు. ఆ గని పక్కన కంపెనీ క్వార్టర్లు నిర్మించి శాంతిఖని బస్తీ, బెల్లంపల్లి పేరుతోనూ బెల్లంపల్లి బస్తీగా ఏర్పాటు చేశారు.



అమరులు..
విప్లవోద్యమంలో చేరి అసువులు బాసిన అమరుల పేర్లతోనూ బస్తీలు ఏర్పడిన చరిత్ర ఉంది. పీపుల్స్‌వార్, సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) ఉద్యమంలో పని చేసి బెల్లంపల్లికి చెందిన పలువురు అమరులయ్యారు. ఉద్యమ ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో బెల్లంపల్లిలో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం భూమి పంపిణీ చేశారు. అలా పంపిణీ చేసిన భూముల్లో వేలాది మంది ఇళ్లు నిర్మించుకోవడంతో బస్తీలు ఏర్పడ్డాయి. బెల్లంపల్లిలో విప్లవ భావజాలాన్ని వ్యాపింపజేసిన గజ్జెల గంగారాం పేరుతో ఓ బస్తీని ఏర్పాటు చేసి 'గంగారాంనగర్'గా పేరు పెట్టారు. విప్లవోద్యమంలో అమరత్వం పొందిన నంది రవీందర్‌రెడ్డి పేరుతో 'రవీందర్‌నగర్', షంషీర్‌ఖాన్ పేరుతో 'షంషీర్‌నగర్', పులి మధునయ్య పేరుతో 'మధునన్న నగర్' అనే బస్తీల పేర్లు బెల్లంపల్లి చరిత్రలో స్థిరపడిపోయాయి. సింగరేణి ఉద్యమ చరిత్రలో కార్మిక హక్కుల కోసం పోరాడి అమరుడైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) వ్యవస్థాపకుల్లో ఒకరైన దేవూరి శేషగిరిరావు పేరుతో రాంమందిర్ ఏరియాలో ఉన్న ఓ వీధికి 'శేషగిరి నగర్' అనే పేరు పెట్టారు.



బెల్లంపల్లి బజారు ఏరియా ప్రాంతం

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు
- కలెక్టర్ బాదావత్ సంతోష్
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు డి.వేణు, శ్యామలాదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ.ప్రేమ్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్లతో వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2.28 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లను తహసీల్దార్లు ప్రతీరోజు పర్యవేక్షించాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చొరవ చూపాలని, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ నంబరు 6303928682 ఏర్పాటు చేశామని, సందేహాలు, సలహాల కోసం సంప్రదించాలని తెలిపారు.

గడువులోగా పూర్తి చేయాలి

జైపూర్: వరి ధాన్యం కొనుగోళ్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శనివారం జైపూర్ మండలం ఇందారంలోని వరలక్ష్మి రైస్‌మిల్లుల్లో వరిధాన్యం సేకరణపై జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రతీ పథకంపై వార్డుల వారీగా సమీక్షించాలి
- సింగరేణిని కాపాడుకుంటేనే కోల్‌బెల్ట్ ప్రాంతాలకు భవిష్యత్
- రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, వేదికపై బాల్క సుమన్, నల్లాల ఓదెలు, నల్లాల భాగ్యలక్ష్మి

రామకృష్ణాపూర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతీ పథకంపై వార్డుల వారీగా చర్చ జరపాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాల్టీ పరిధి ఆర్కేపీ ఠాగూర్ స్టేడియంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందని అన్నారు. రిజర్వేషన్ల పేరిట రాష్ట్రంలో హిందూ, ముస్లింల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుటిల పన్నాగాలు పన్నుతున్నారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగితే కార్మిక, వ్యవసాయ, ఆర్థిక రంగాల అభివృద్ధి కుంటుపడి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతాయని తెలిపారు. ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తాను చెన్నూర్ నుంచే పోటీ చేస్తానని, ఇక్కడ తన నాయకత్వాన్ని బలపరిస్తే కుటుంబసభ్యుడిగా సమస్యలన్నీ పరిష్కరిస్తానని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సహకారంతో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.35 కోట్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బతుకమ్మ వేదికలు, ఓపెన్‌జిమ్స్ తదితర అభివృద్ధి పనులు కళ్ల ముందే కనిపిస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సింగరేణి సంస్థ భవితవ్యం ప్రశ్నార్థకంగా ఉందని, నష్టాల పేరిట సంస్థను అదానీకి అప్పగించేందుకు కేంద్రం కుట్రపన్నుతోందని ధ్వజమెత్తారు. బీజేపీ కుట్రలను అడ్డుకోవాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి యజ్ఞం ఇలాగే కొనసాగాలన్నా బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు అండగా నిలువాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్ పనాస రాజు, సీపీఐకి చెందిన కౌన్సిలర్ మేకల తిరుమల బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్ నుంచి సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, టీబీజీకేఎస్ నేత కెంగర్ల మల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, గాండ్ల సమ్మయ్య, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డెక్కుతున్న రైతులు



దండేపల్లి మండలం చెల్కగూడెం వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

- ధాన్యం సేకరణలో జాప్యంపై ఆగ్రహం
- అకాల వర్షాలతో తడుస్తున్న వైనం

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రైతులు రోడ్డెక్కుతున్నారు. తూకం లేక.. మిల్లులకు ధాన్యం తరలింపులో జాప్యం కారణంగా రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి, కొట్టుకుపోయి నష్టపోవాల్సి వస్తుందని రాస్తారోకోలు, ధర్నాలు చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఆలస్యం చేయకుండా ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించాలని ఈ నెల 27న హాజీపూర్ మండల రైతులు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 27న లక్సెట్టిపేటలో, 28న దండేపల్లి మండలం చెల్కగూడెం వద్ద రాస్తారోకో చేశారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేకపోవడంతో అద్దెకు తీసుకొచ్చి ధాన్యం కుప్పలపై కప్పుతున్నారు. వారం రోజులుగా ఏదో ఒక చోట ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి ధాన్యం తడిసిపోతోంది. జిల్లాలోని జన్నారం, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో ఇప్పటివరకు 59 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. 2,110 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 1,480 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్‌మిల్లులకు తరలించారు. ఇంకా కొనుగోలు కేంద్రాల్లో వేల క్వింటాళ్ల ధాన్యం ఆరబోసి తూకం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

నీటిపాలవుతోంది..



కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోసి వారం రోజులైంది. తూకం కోసం ఎదురు చూస్తున్న. రోజు పొద్దున ఎండకు ఆరబెట్టుడు, మాపటీలి కుప్పజేస్తున్నా. శుక్రవారం తెల్లారంగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. – అప్పని భూమన్న, గ్రామం: కర్ణమామిడి

ఆలస్యం చేయకుండా కొనాలి



వరికోసి పదిరోజులైతుంది. సెంటర్లో రోజు నేర్పుతూ ఆరబెడుతున్నాం. ఆలస్యం చేయకుండా తూకం వేసి మిల్లుకు తరలించాలి. భారీ వర్షం వస్తే తడిసిపోతుంది. ఎప్పుడు కొంటరో.. ఎప్పుడు మి ల్లుకు పంపుతరో తెల్వడం లేదు. ఆలస్యం చేయకుండా మిల్లుకు తరలించాలి.
– కాసు సత్తయ్య, గ్రామం: బాదంపల్లి, మం: జన్నారం

'స్వయం' రుణాలకు బ్రేక్..!
- మహిళా సంఘాలపై వీవోఏల సమ్మె ప్రభావం
- స్త్రీనిధి రుణాల వసూళ్ల నిలిపివేత
- వడ్డీ రాయితీ కోల్పోనున్న సభ్యులు

దండేపల్లి: మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ)పై వీవోఏ(గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)ల సమ్మె ప్రభావం పడుతోంది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 3నుంచి 16వరకు విధులు బహిష్కరించి 17నుంచి నిరవధిక సమ్మె, రిలే దీక్షలు, దీక్షా శిబిరాల వద్ద వినూత్న నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే. వీరి సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మె కొనసాగిస్తున్నారు. ఫలితంగా మహిళా సంఘాల సభ్యుల నెల నెల సమావేశాలు కూడా నిలిచిపోయాయి. వీవో సంఘాల సమావేశాలూ జరగడం లేదు. వీటి కారణంగా స్త్రీనిధి రుణ వసూళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న వారు కూడా వడ్డీ రాయితీ కోల్పోనున్నారు. పైగా అవసరమున్న వారికి కొత్తగా బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు మంజూరు కావడం లేదు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించలేదు. వీవోఏలు సమ్మెలో కొనసాగడంతో మహిళా సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి న్యాయమైన డిమాండ్లు తీర్చి సమ్మెను విరమింపజేసి తమ ఇబ్బందులను తొలగించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.



దండేపల్లిలో నిరవధిక సమ్మెలో వీవోఏలు

జిల్లాలో

వీవోఏలు	460
మహిళా సంఘాలు	10,158
సభ్యులు	1,12,640

ఇవీ డిమాండ్లు

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలి. కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలి. ప్రతీ మహిళ సంఘ సభ్యురాలికి రూ.5లక్షల సాధారణ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. మహిళా సంఘాలకు రావల్సిన అభయహస్తం డబ్బులు, నేటివరకు ఇవ్వాల్సిన వీఎల్‌ఆర్ తిరిగి సంఘాలకు చెల్లించాలి. వీవోఏలకు సెర్ప్ నుంచి ఐడీ కార్డు ఇవ్వాలి. ప్రతీ నెల వీవోఏల వ్యక్తిగత ఖాతాలో వేతనాలు జమ చేయాలి. అర్హులైన వీవోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలి. స్త్రీనిధి ఇన్సెంటివ్ వీవోల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలి.

ఇబ్బందులు అవుతున్నాయి..



వీవోఏలు సమ్మెలో ఉండడంతో మహిళా సంఘాల సభ్యులకు చాలా ఇబ్బంది అవుతుంది. నెల నెల సమావేశాలు జరగడం లేదు. వీవో సమావేశాలు కూడా నిర్వహించడం లేదు. పైగా కొత్తగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు మంజూరు కావడం లేదు. స్త్రీనిధి రుణాల వసూళ్లు నిలిచి పోయాయి. దీంతో వడ్డి రాయితీ కోల్పోతున్నాం. వీవోఏల సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలి.
– పేరం రజిత, గ్రూపు సభ్యురాలు

సమస్యలు పరిష్కరించాలి..



మా న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలి. సమ్మెకు వెళ్లె ముందు నోటీసు అందించాం. ఈ నెల 17నుంచి నిరవధిక సమ్మె చేస్తూ రోజుకో తీరు నిరసనలు చేస్తున్నాం. అయినా ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించడం లేదు. వీవోఏలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదు. – బొలిశెట్టి అనంతలక్ష్మీ, వీవోఏల మండల అధ్యక్షురాలు, దండేపల్లి

క్లుప్తంగా

పులిదాడిలో గాయపడిన ఆవు మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడలో తలండి నారాయణకు చెందిన ఆవుపై శుక్రవారం పులి దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. శనివారం ఆవు మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు పరిహారం అందిస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి వృద్ధుడు మృతి

మంచిర్యాలక్రైం: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడి వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. స్థానిక శ్రీశ్రీనగర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం (ఆనందనిలయం)లో నస్పూర్ మండలంలోని సీతారాంపల్లెకు చెందిన దామరకొండ బీరయ్య(70) కొంతకాలంగా అనాధగా ఉంటున్నాడు. శనివారం తన బట్టలు ఆరేసెందుకు బిల్డింగ్ పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ విత్తనాలు పట్టివేత

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండలంలోని టీకులపల్లి స్టేజీ వద్ద శనివారం పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సాంబశివారెడ్డి, అలియాస్ శివయ్య, డ్రైవర్ శ్రీకాంత్‌గౌడ్ మ్యాజిక్ పికప్ వెహికిల్‌లో సుమారు 8 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు కన్నెపల్లి మండలానికి తరలిస్తుండగా కన్నెపల్లి పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.15 లక్షలకుపైగా ఉంటుందని వ్యవసాయాధికారులు, పోలీసులు పేర్కొంటున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

మేడే ఘనంగా జరుపుకోవాలి

బెల్లంపల్లి: మేడేను ఘనంగా జరుపుకోవాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ.చాంద్ పాషా అన్నారు. శనివారం బెల్లంపల్లిలోని సివిక్ కార్యాలయం ఆవరణలో మేడే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాల రాస్తున్నారని, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణతో కార్మికుల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయని అన్నారు. పోరాటాలతోనే కార్మికులు హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు భాను, సునీత, సురేష్, పోసక్క, చంద్రకళ, అమృత, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, కమల, దేవమ్మ పాల్గొన్నారు.

టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో..

సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్(టీఎస్టీయూసీ) ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నాయకులు పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. టీఎస్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ టి.మణిరాంసింగ్, నాయకులు మల్లయ్య, హసన్, తిరుపతి, హరికిషన్‌పాండే, జీవరత్నం, గంగాధర్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నస్పూర్: నస్పూర్ పట్టణంలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేసి మే నెలలో ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శనివారం ఆయన కలెక్టర్ భవన నిర్మాణ పనులను రోడ్లు భవనాల శాఖ ఈఈ రాముతో కలిసి తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు అన్నింటినీ ప్రజలకు ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సమీకృత కలక్టరేట్ భవన నిర్మాణాలు చేపట్టిందని వివరించారు. భవనం ఆ వరణలో ఆహ్లాదం కోసం చెట్లు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక బత్తీస్‌గఢ్ కోట



గండి రామన్న హరితవనం



బత్తీస్‌గఢ్ కోటపై ఉన్న ప్రహరీ



ఆస్వాదిద్దాం రండి...



విద్యుత్ కాంతుల్లో శ్యాంఘడ్ కోట

సండే స్పెషల్

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులకు సెలవుల కాలం.. పదోతరగతి, ఇంటర్, తదితర పరీక్షలన్నీ పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులంతా విహారయాత్రలకు వెళ్లేందుకు, ప్రకృతిఒడిలో సేద తీరేందుకు ఇదే సరైన సమయం. ఇందుకోసం వ్యయప్రయాసలకోర్చి వెళ్లలేనివారికి ఇక్కడే మన చెంతనే జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఆహ్లాదం పొందేందుకు, వీక్షించేందుకు ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే సహ్యాద్రి పర్వత శ్రేణులలోని మహబూబ్ ఘాట్స్.. స్వర్ణనది గోదావరిలో కలిసే సోన్ సంగమ ప్రదేశం, పార్కులు.. వెరసి చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. వీటికితోడు చారిత్రక ప్రదేశాలు శ్యాంఘడ్, బత్తీస్‌ఘడ్, నిర్మల్ కోటలు ఇక్కడే ఉన్నాయి. వీటిపై 'సాక్షి' కథనం.

- వేసవి కాలక్షేపం మన చెంతనే
- సేదతీరే ఆహ్లాదం ఇక్కడే..
- చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో..
- చారిత్రక నేపథ్యం కూడా...
- దూరభారం, వ్యయప్రయాసల్లేవ్..

ఓ లుక్కేద్దాం...రండి...

ప్రకృతితో మమేకమయ్యేందుకు నిర్మల్ సమీపంలోగల గండిరామన్న హరితవనం ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరుగా నిలుస్తోంది. జిల్లా కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ హరితవనం ఉండగా నిత్యం వందలాది మంది ప్రజలు ఈ పార్క్‌ను సందర్శిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో పట్టణ ప్రజలే కాక ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే అనేక మంది ఇక్కడ ఆగి సేద దీరుతారు. ఉదయం వాకర్స్, సీనియర్ సిటిజన్స్‌కు అనువుగా పలు ప్రదేశాలు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల పార్క్, వాచ్‌టవర్, క్యానోపివాక్ సౌకర్యం కలదు. తెల్లవారుజామున వందలాది సంఖ్యలో దర్శనం ఇచ్చే నెమళ్లు, పలు రకాల పక్షుల కిలకిలరావాలతో మనస్సుకు ఒకింత ఆహ్లాదం కలుగుతుంది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్యలో నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ర్యాంపులపై సందర్శకులు నడుస్తున్నప్పుడు చక్కటి అనుభూతి పొందుతారు. కోతులు, జింకలకు ఇక్కడ సంరక్షణ కేంద్రాలున్నాయి. అటవీశాఖ అధికారులు ప్రవేశ రుసుముతో పాటు సఫారి వాహన సౌకర్యం కల్పించారు. సందర్శకులకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

మరింత అభివృద్ధి జరగాలి



నిర్మల్ చుట్టుపక్కల ప్రాంతాల్లోగల పర్యాటక ప్రదేశాల్లో వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. టూరిజం శాఖ మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు కాకముందే వాటిని సంరక్షించుకుంటే భావితరాలకు పురాతన చరిత్రను అందించే అవకాశం ఉంటుంది.

– గందం రత్నాకర్, నిర్మల్

వసతులు మెరుగుపర్చాలి



నిర్మల్‌కు చారిత్రాత్మకంగా మంచి గుర్తింపు తేవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి కోటలు, కందకాలు, బురుజులు నాటి పరిపాలనా కాలాన్ని తెలుపుతాయి. వసతులు మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– ధోండి శ్రీనివాస్, నిర్మల్

చారిత్రక కోటలెన్నో...



ఖిల్లాగుట్ట

నిర్మల్ పట్టణం శివారులో గొలుసుకట్టు చెరువులతో పాటు ఆనాటి పాలకుడైన నిమ్మలనాయుడు పట్టణం చుట్టూ ప్రధానమైన రక్షణగోడ నిర్మించాడు. చెరువులను అనుసంధానం చేస్తూ కందకాలు నిర్మించాడు. నాటి ఆనవాళ్లను చూపే బత్తీస్‌ఘడ్, శ్యాంఘడ్, ఖిల్లా గుట్ట, (రాజసౌధం) తదితర చూడదగిన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

వందేళ్ల చరిత్ర కలిగిన సోన్ వంతెన



ప్రాచీన కాలంనాటి సోన్ వంతెన

నిర్మల్-నిజామాబాద్ జిల్లాలను కలిపే సోన్ గోదావరి నదిపైన నిజాం కాలంలో వందేళ్ల క్రితం నిర్మించిన పొడవైన వంతెన ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. నూతనంగా నిర్మించిన వంతెన ఉన్నప్పటికీ పురాతన వంతెన చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది.

సహజత్వం ఉట్టిపడేలా కొయ్యబొమ్మలు



కొయ్యబొమ్మల తయారీలో కళాకారులు

నిర్మల్ పేరు వినగానే కొయ్యబొమ్మలు గుర్తొస్తాయి. సహజత్వం ఉట్టిపడేలా ఇక్కడి కళాకారులు పొనికి కర్రతో తయారు చేసే కొయ్య బొమ్మల్లో ఆకర్షించే గుణం ఉంది. శిల్పకళ, చిత్రకళలో ఆరితేరిన నిపుణులకు నిర్మల్ నెలవుగా ఉంది. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన నిర్మల్ పెయింటింగ్స్‌కు, కొయ్యబొమ్మలకు నిలయంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది.

ప్రకృతి రమణీయత...



గండిరామన్న హరితవనం

నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డు నుంచి దాదాపు పది కిలోమీటర్ల దూరంలో ప్రకృతిని అస్వాదించేలా దట్టమైన అడవులు, వంపుతిరిగిన రోడ్లు మనస్సుకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. కొరటికల్, మొండిగుట్ట, బూర్గుపెల్లి, తాండ్ర, తదితర గ్రామాలు ఈ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. పచ్చదనం పరుచుకుని ఉన్న ప్రకృతిఒడిలో సేద తీరటానికి అనువైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

మ్యారేజ్ బ్యూరోల జిల్లా కమిటీ ఎన్నిక

మందమర్రిరూరల్(చెన్నూర్): మంచిర్యాల జిల్లా మ్యారేజ్ బ్యూరోల మీడియేటర్స్ ఆత్మగౌరవ గుర్తింపు సాధన జాయింట్ యాక్షన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నగునూరి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులుగా సుమోహన్, భూమయ్య, చీఫ్ అడ్వయిజర్‌గా సట్ల రవీందర్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జిగా పంజా సమ్మయ్య యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జంపాల తిరుమలేశ్, ఉపాధ్యక్షులుగా బొంగోని వెంకటస్వామిగౌడ్, డేగ శ్రీనివాస్, సీహెచ్ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గోమాస బ్రహ్మానందం, కార్యదర్శులుగా గణపతి, ఖాజామొహినొద్దీన్, సహాయ కార్యదర్శులుగా కందుకూరి నర్సయ్య, కొండ రాజలింగు, అధికార ప్రతినిధిగా బోగ చంద్రమౌళి, ప్రచార కార్యదర్శిగా సుశీల, వెంకటనర్సయ్య, చాట్లపల్లి రాజేశ్, కోశాధికారిగా గట్ల దయాకర్, కార్యవర్గ సభ్యులుగా కారుకూరి శ్రీనివాస్, గణేశ్‌సింగ్, రమేశ్, గజ్జెల మల్లేశ్, పెంబర్తి మొగిలి, మధుకర్, రాజయ్య ఎన్నికయ్యారు.

మార్లావాయిని సందర్శించిన కేయూ ప్రొఫెసర్



నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఈసం నారాయణ

నార్నూర్(జైనూర్): జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామాన్ని శనివారం కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు సందర్శించారు. హైమన్‌డార్ఫ్, ఎలిజిబెత్ దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు ఇంటికి వెళ్లి ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాల వ్యవహారాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ జుగ్నాక సావిత్రి ధర్మేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెలో సైతం రక్తదానం

వేమనపల్లి(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజ్‌కుమార్ శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నిరవధిక సమ్మెలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు సిరాజ్, సుదర్శన్ శిబిరానికి వెళ్లి రక్తదానం చేశారు. సుమారు 34 మంది దాతలు రక్తదానం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, డీటీ సంతోష్, ఆర్‌ఐ లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్ దేవేందర్, రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా సాగింది. జిల్లాలో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 1526 మంది విద్యార్థులకు గాను 1379 మంది హాజరుకాగా 147 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు ఎంజేపీ ఆర్‌జేసీ, ఆర్‌డీసీ సెట్

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రం మంచిర్యాలలో మహాత్మా జ్యోతిబా పూలే(ఎంజేపీ) తెలంగాణ బీసీ వెల్ఫేర్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఆర్‌జేసీ, ఆర్‌డీసీ సెట్ ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశామని మహాత్మా జ్యోతిబా పూలే విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల జెడ్పీ బాలురు, బాలికల పాఠశాల, మిమ్స్ చైతన్య, కృష్ణవేణి, ట్రినిటి, కార్మెల్‌హైస్కూల్, ఉషోదయ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1572 మంది విద్యార్థులు జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి, 252 మంది డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ డిపో స్థలాన్ని పరిశీలించిన డీఎం

చెన్నూర్: చెన్నూర్ పట్టణ సమీపంలోని గెర్రె కాలనీలో ఆర్టీసీ బస్ డిపో కోసం కేటాయించిన స్థలాన్ని ఆర్టీసీ అధికారులు శనివారం పరిశీలించారు. త్వరలోనే ఆర్టీసీ డిపో నిర్మాణం ప్రారంభించేందుకు ఆర్టీసీ సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్థలాన్ని పరిశీలించారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఆంజనేయులు, ఏఈ మల్లారెడ్డి, ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్, విజిలెన్స్ అధికారి సురేందర్‌రావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గొర్రెలు ఎంపిక చేసుకోవాలి

జైపూర్: ఆరోగ్యవంతమైన గొర్రెలు ఎంపిక చేసుకోవాలని, 18నెలల నుంచి 24నెలల గొర్రెలనే కొనుగోలు చేసుకోవాలని పశుసంవర్ధశాఖ జేడీ వై.రమేష్ తెలిపారు. జైపూర్ మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీలకు చెందిన 12సొసైటీల సభ్యులకు శనివారం స్థానిక రైతుల వేదికలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏడీ శంకర్‌తో కలిసి జేడీ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కడపలో గొర్రెల కొనుగోళ్లకు అవకాశం కల్పించారని తెలిపారు. మండల వ్యాప్తంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమానికి 330మందిని ఎంపిక చేయగా 130మంది డీడీలు తీశారని మిగతా 200మంది త్వరగా డీడీలు తీస్తే అందరికీ ఒకే దఫాలో గొర్రెలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సతీశ్ పాల్గొన్నారు.

లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న డైరెక్టర్ల సతీమణులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్‌లోని ఇల్లెందు క్లబ్‌లో శనివారం లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్, ఎస్టీపీపీలోని లేడీస్ క్లబ్ సంయుక్తంగా ఈ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ సతీమణి హరిణి, డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీనివాస్ సతీమణి కళ్యాణి, డైరెక్టర్ (పీపీ)జీ.వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిణి సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో కొత్త సంబంధాలు ఏర్పడుతాయన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, క్లబ్ సభ్యులు డాలి నూర్, స్వరూప, స్వరాజ్యం, యశోద పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్ రెండో సెషన్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఈ నెల 6నుంచి 15వరకు పరీక్షలు జరుగగా శనివారం ఫలితాలు వెలువడ్డాయి. 32మంది జేఈఈ పరీక్ష రాయగా వీరిలో 18మంది ఐఐటీ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలు అర్హత సాధించిన వారికి దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో ప్రవేశం కల్పిస్తారు. సిలివేరు వినయ్ 81.37 పర్సంటైల్‌తో కళాశాల టాపర్‌గా నిలువగా, ముంజం అంజన్న 74.98, ఎనగందుల మౌర్య 74.47, వైరగడే రాహుల్ కుమార్ 74.30, చునార్కార్ అఖిలేశ్వర్ 71.31 పర్సంటైల్ సాధించారు. ఎస్టీ విభాగంలో తేజావత్ సిద్ధు 7008 జాతీయ ర్యాంకుతో మొదటి స్థానాన్ని దక్కించుకోగా మరో విద్యార్థి పి.విశాల్ 1109 ర్యాంకు సాధించాడు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, అధ్యాపకులు అభినందించారు. అధ్యాపకులు నాగినేని శ్రీరామవర్మ, మిట్టా రమేష్, చందా లక్ష్మీనారాయణ, సుంకరి అర్జున్, కట్ల రవీందర్, సురేష్‌గౌడ్, సిబ్బంది సమేందర్, తేజస్వీ, రాజశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

భీమారం విద్యార్థికి 12వ ర్యాంకు

భీమారం: మండల కేంద్రానికి చెందిన పల్ల రాకేష్ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించాడు. 1 నుంచి 7వ తరగతి వరకు భీమారంలోని గీత ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో, 10వ తరగతి నుంచి ఇంటర్ వరకు కరీంనగర్ అల్ఫోర్స్‌లో చదివాడు. రాకేష్ తండ్రి లక్ష్మీనారాయణ ఆటో నడుపుతూ చదివించాడు.



జేఈఈ మెయిన్స్‌లో 12వ ర్యాంకు సాధించిన రాకేశ్